# లంకా, జినుగు, సత్వాజీలు ఎందుకలా మాట్లాడుతున్నారంటే...

సమాజాన్ని మార్చడం గురించిన చర్చ ఎప్పుడూ వాడిగా వేడిగా జరుగుతుంటుంది. ఇక సమాజాన్ని సమూలంగా మార్చివేసి నూతన సమాజాన్ని నిర్మించేందుకు సాగే విప్లవోద్యమం గురించి, దాని పంథా గురించి చర్చ జరగడం అబ్బురమేమీ కాదు. విప్లవ పురోభివృద్ధి కోసం నిజాయితీగా చేసే చర్చ ఎంత లోతైనదైతే అంత ఉపయోగకరంగా ఉంటుంది. అలాంటి చర్చ ప్రశంసనీయమైనది కూడా. కానీ ఇందుకు పూర్తి భిన్నంగా విప్లవాన్ని నాశనం చేయడం కోసం ప్రజా శత్రువులు నిరంతరాయంగా విప్లవానికి వ్యతిరేకంగా చేసే వాదనలకు, వివిధ ముసుగులు ధరించి వారి పక్షాన నిలిచే విప్లవ ద్రోహులు, కుహనా మేధావులు, కపట జర్నలిస్టులు, దొంగ సామాజిక కార్యకర్తలు విప్లవం గురించి చేసే నయవంచక వాదనలకు రూపంలో కొంత తేడా ఉండవచ్చునేమో కానీ సారంలో తేడా ఉండదు. ఎందుకంటే ప్రజా శత్రువులు ప్రజా ఉద్యమాల గురించి మాట్లాడేది/రాసేది స్పష్టంగా శత్రుపూర్వకంగా ఉంటుంది. చాలా మందికి దీనిని అర్థం చేసుకోవడం కష్టం కాదు. కానీ శత్రు పక్షాన నిలిచిన నానాగోత్రీకులు సిద్ధాంత, రాజకీయ అభిప్రాయాలు/విమర్శ/చర్చ పేరుతో ముందుకు తెచ్చే కుహనా వాదనలు ప్రమాదకరమైనవే కాకుండా, మోసపూరితమైనవి కూడా. అందువల్ల వీటి పట్ల మరింత అప్రమత్తంగా ఉండాలి. వీటిని సైద్ధాంతికంగా, రాజకీయంగా తిప్పికొట్టాల్సిన అవసరం మరింత ఎక్కువగా ఉంటుంది. విప్లవ పార్టీలోని అత్యున్నత స్థానంలో పనిచేసే క్రమంలో తమ తప్పులు, లోపాల పట్ల నిజాయితీతో కూడిన ఆత్మవిమర్శ కొరవడి, శత్రువు తీవ్రతరం చేసిన ప్రతీఘాతుక దాడికి వెరచి, తమ కమిటీ సభ్యుల, తాము గైడ్ చేసే కామ్రేడ్స్ విశ్వాసం కోల్పోయి, విప్లవ చేవ చచ్చి తమపై తమకు, విప్లవంపై, ప్రజలపై విశ్వాసం కోల్పోయి శత్రువుకు లొంగిపోయిన విప్లవ ద్రోహులు లంకా, జినుగు, సత్వాజీలు తుచ్ఛమైన తమ స్వార్థ ప్రయోజనాల కోసం, విప్లవ పార్టీపై, విప్లవోద్యమంపై సైద్ధాంతిక, రాజకీయ దాడికి పూనుకున్నారు. ఇందులో భాగంగానే వీరు విప్లవ వ్యూహం–ఎత్తుగడల గురించి, వీటిలో చేసుకోవలసిన మార్పుల గురించి, విప్లవ పార్టీ శక్తి సమర్థతల గురించి, విప్లవంలో ప్రజల పాత్ర గురించి, విప్లవ భవితవ్యం గురించి బూటకపు వాదనలు చేస్తున్నారు.

లంకా పాపిరెడ్డి, జినుగు నరసింహారెడ్డి, ఒగ్గు సత్వాజీలు భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)లోనూ, కేంద్ర కమిటీలోనూ మాజీ సభ్యులు. వీరు వరుసగా ఒకరు పన్నెండేళ్ల క్రితము, మరొకరు రెండేళ్ల క్రితము, ఇంకొకరు ఈ సంవత్సర ఆరంభంలో పార్టీ నుంచి బయటకు వెళ్లిపోయి శత్రువుకు లొంగిపోయారు. ఈ ద్రోహులు పోలీసులకు లొంగిపోయిన సందర్భంగా వారి గొంతుతో గొంతు కలిపి పార్టీకీ, విప్లవోద్యమానికి వ్యతిరేకంగా పలు నీచమైన ఆరోపణలు చేసారు. ఇటీవల పోలీసు ఇంటెలిజెన్స్ అధికారులు లంకా, జినుగులతో ఐడ్రీం టీవీ చానల్ ద్వారా ఇంటర్వ్యూ ('క్రైమ్ కన్ఫెషన్') చేయించి విప్లవోద్యమంపై దాడి చేయించారు. ఐడ్రీం ప్రశ్నలకు జవాబుగా వారు వెలుబుచ్చిన అభిప్రాయాలు, లొంగిపోయినప్పుడు

సత్యాజీ చెప్పిన మాటల సారం పార్టీ పంథాకు, ఆచరణకు పూర్తిగా వ్యతిరేకమైనవి. వీరి విప్లవ ద్రోహం గురించి, వీరి పోలీసు చిలకపలుకుల గురించి తెలియని కొందరు విప్లవశ్రేయోభిలాషులలో సందేహాలు కలిగించే అవకాశం ఉన్నది.

ప్రపంచవ్యాప్తంగా సామ్రాజ్యవాదులు, వారి తొత్తు పాలకవర్గాలు కమ్యూనిస్టు విప్లవోద్యమాలను, జాతి విముక్తి ఉద్యమాలను అణచివేసేందుకు ఈ ఉద్యమాల్లో పనిచేసి తమకు లొంగిపోయిన వారిని వివిధ రకాలుగా ఈ ఉద్యమాలకు వ్యతిరేకంగా వినియోగించుకొని దాడి కొనసాగించిన అనుభవాలు కోకొల్లలుగా ఉన్నాయి. మన దేశం ఇందుకు మినహాయింపు కాదు. సామ్రాజ్యవాదులు, వారి తొత్తు పాలకవర్గాలు మన దేశంలో తమ దోపిడీ పీడనలకు, కాలంచెల్లిన ఈ కుళ్లు వ్యవస్థకు పెద్ద ఆటంకంగా/ప్రమాదకరంగా ఉన్న మావోయిస్టు పార్టీని, విప్లవోద్యమాన్ని తుడిచిపెట్టే లక్ష్యంతో వీరు మహత్తర తెలంగాణ సాయుధ పోరాట కాలం నుండే ఇలాంటి దాడి కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగానే వీరు, ప్రత్యేకించి బ్రాహ్మణీయ హిందూ ఫాసిస్టు పాలకులు విప్లవోద్యమానికి వ్యతిరేకంగా తలపెట్టిన వ్యూహాత్మక 'సమాధాన్' దాడిలో భాగంగానే ఈ విప్లవ ద్రోహులచే ఈ మానసిక యుద్ధాన్ని-సైద్ధాంతిక దాడి చేయిస్తున్నారు. సామ్రాజ్యవాద ప్రాయోజిత, దళారీ పాలకవర్గ నిర్దేశిత, శత్రు ఇంటెలిజెన్స్ అధికారుల దర్శకత్వాన విప్లవానికి వ్యతిరేకంగా ప్రదర్శించిన నాటకంలో లంకా, జినుగు, సత్యాజీల డైలాగులను ఈ నేపథ్యం నుంచే చూడాలి.

## లంకాకు పార్టీ ఎత్తుగడలను మార్చుకోవాలనే, సైద్ధాంతికంగా బలహీనంగా ఉందనే హక్కు ఉందా?

విప్లవ పార్టీ నుంచి, విప్లవోద్యమం నుంచి పలాయనం చిత్తగించి శత్రువుకు లొంగిపోయి సామాజిక కార్యకర్త అవతారం ఎత్తిన లంకా పాపిరెడ్డి భారత విప్లవోద్యమం మారిన పరిస్థితులకు అనుగుణంగా పార్టీ ఎత్తుగడలు మార్చుకుంటేనే ఉద్యమాన్ని ముందుకు నడిపించగలుగుతుందన్నదనీ, పార్టీ సైద్ధాంతికంగా బలహీనంగా ఉండడం వల్ల అది ముందుకుపోవడం మాట అటుంచి చాలా సంవత్సరాల క్రితమే వెనక్కుపోయిందనీ, దేశంలో చాలా మందికి మావోయిస్టులు ఏం చేస్తున్నారో తెలీదనీ, మావోయిస్టు పార్టీలో ఉంటేనే ప్రజలకు సేవ చేయగలమని అనుకోనవసరం లేదని అన్నాడు.

స్పష్టమైన విప్లవ లక్ష్యం, సరైన విప్లవ పంథా కలిగిన పార్టీకీ, పార్టీ నాయకత్వానికీ మారుతున్న అంతర్జాతీయ, దేశ పరిస్థితులకు, ఉద్యమ పరిస్థితులకు అనుగుణంగా ఎత్తుగడలు మార్చుకోవాలనే విషయం తెలుసు. కానీ మాజీ మావోయిస్టు లంకా ఈ విషయాన్ని లేవనెత్తడం వెనుక ఉన్న లక్ష్యం పార్టీ నాయకత్వం విప్లవాన్ని విజయవంతంగా నడపలేదనే అవిశ్వాసాన్ని ప్రజల్లో కలిగించి వారిని విప్లవం నుంచి పక్కకు మళ్లించడమే తప్ప మరొకటి కాదు. పలు కారణాల రీత్యా మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా కొన్ని సందర్భాలలో పార్టీ సకాలంలో తన ఎత్తుగడలు మార్చుకోలేకపోవచ్చు. పార్టీ ఎత్తుగడలు మార్చుకోకపోతే దానికి ఎత్తుగడలు

మార్చుకునే ఉద్దేశ్యం లేదని యెద్దేవ చేసే హక్కు విప్లవానికి వెన్ను చూపిన లంకా లాంటి వారికి ఎంతమాత్రమూ లేదు. కేంద్ర, రాష్ట్ర స్థాయిలో 'కొమ్ములు తిరిగిన' అగ్ర నాయకత్వం విప్లవానికి ద్రోహం చేసినప్పటికీ విప్లవ లక్ష్యానికీ, విప్లవ పంథాకు దృఢంగా అంటిపెట్టుకొని ఉండడం వల్లనే, సైద్ధాంతికంగా, రాజకీయంగా, సామాజికంగా ఎదురైన సవాళ్లకు ఎదుర్కోవడం ద్వారానే కామ్రేడ్ చారుమజుందార్ నాయకత్వంలో విప్లవ శక్తులు నక్సల్బరీలో వసంత మేఘగర్జన సృష్టించగలిగాయి. అదే సమయంలో కామ్రేడ్ కన్హయ్ చటర్జీ సృష్టించిన చరిత్ర ఇలాంటిదే. మన పార్టీ చరిత్రంతా ఇదే వరవడిలో నడిచింది. విప్లవరంగంలో నిలబడి పోరాడేవారే అక్కడ ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోగలుగుతారు తప్ప విప్లవరంగంలో శత్రువుకు వెన్నుచూపేవారు కాదు. ఎత్తుగడలనేవి రెడీమేడ్‌గా ఎక్కడా ఉండవు. అవి పరిస్థితులకు అనుగుణంగా ఎప్పుడూ మార్చుకోవాల్సి ఉంటుంది. నిజానికి గత అర్ధ శతాబ్ద కాలంలో జరిగిన పరిణామాల వల్ల దేశ అర్ధవలస, అర్ధ-భూస్వామ్య సమాజ స్వభావం మారకపోయినప్పటికీ భారత నూతన ప్రజాస్వామిక విప్లవానికి నాయకత్వం వహిస్తున్న మన పార్టీ ముందు, పీడిత వర్గాల ముందు పలు నూతన సమస్యలు, సవాళ్లు ముందుకు వచ్చాయి. వీటిని దృష్టిలో ఉంచుకొని నూతన ఎత్తుగడలను పార్టీ రూపొందించి అమలు చేయడం వల్లనే విప్లవోద్యమంతో పాటు విప్లవ పార్టీ అభివృద్ధి చెందాయనే విషయం లంకాకు తప్ప అందరికీ తెలుసు. ఇంకా మారిన పరిస్థితులకు తగినట్లు నూతన ఎత్తుగడలు చేపట్టి ప్రజలను విస్తృతంగా కదిలించి విప్లవోద్యమాన్ని అభివృద్ధి చేయడానికి కృషి చేయాల్సి ఉంది. ఇంకా పలు విషయాలపై అధ్యయనం చేసి సరైన ఎత్తుగడలను రూపొందించుకోవాల్సిన కర్తవ్యం మన పార్టీ ముందు ఉంది.

ఈ మాజీ మావోయిస్టులు చెబుతున్నట్లుగా సైద్ధాంతికంగా పార్టీ బలహీనంగా ఉంటే, సిద్ధాంతానికి కట్టుబడి పనిచేయకపోతే ఉద్యమం ఇప్పుడు ఈ స్థాయిలోకి ఎదిగి ఉండేదే కాదు. భారత దోపిడీ పాలకవర్గాలు, వారి సామ్రాజ్యవాద ప్రభువులు ఇంతగా బెంబేలుపడి ఒకదాని తరువాత మరో బహుముఖ అణచివేత వ్యూహాలతో క్రూరంగా దాడులు సాగిస్తూ వేలాది విప్లవకారుల, ప్రజల నెత్తురును ఏరులుగా పారించేవారే కాదు. సైద్ధాంతిక బలం ఉన్నందువల్లనే 2004లో ఒక పెద్ద నూతన పార్టీగా రెండు విప్లవ స్రవంతులు ఐక్యమయ్యాయి. 2013లో విప్లవ కమ్యూనిస్టుల ఏకీకరణను పూర్తి చేశాయి. ఐక్య పార్టీ నిర్మాణానికి ముందూ, ఆ తర్వాత కూడా పార్టీ రెండు పంథాల మధ్య పోరాటంలో అనుభవం సంపాదించింది, రాటుదేలింది. అయితే పార్టీ సైద్ధాంతికంగా మరింత బలపడవలసి ఉన్నది. ఇది నిరంతరం సాగే క్రమం. సిద్ధాంతాన్ని నిర్దిష్ట పరిస్థితికి అనుగుణంగా సృజనాత్మకంగా అన్వయించడం, దానిని ఆచరణలో పరీక్షకు గురిచేయడం, ఆచరణలో వచ్చిన గుణపాఠాల నుంచి తిరిగి సిద్ధాంతాన్ని మెరుగుపరచుకోవడం – ఇలా సిద్ధాంతం.. ఆచరణ.. అనే ప్రక్రియ ద్వారా పార్టీ సైద్ధాంతిక స్థాయి పెరుగుతుంది. ఆచరణతో సంబంధం లేకుండా శత్రు ఇంటెలిజెన్స్ అధికారులు పలికించే సిద్ధాంత చిలకపలుకులు వల్లిస్తే సిద్ధాంత స్థాయి పెరగదు. ఇంతకూ లంకా శత్రువుకు లొంగిపోయిన తర్వాత పార్టీ సిద్ధాంతపరంగా బలహీనంగా ఉందనే చర్చ ఎందుకు లేవదీసినట్టు?

ఎందుకంటే, శత్రువు దశాబ్దాల తరబడి కొనసాగిస్తున్న బహుముఖ విప్లవ ప్రతీఘాతుక దాడికి తోడ్పడేందుకు పార్టీ పట్ల, దాని నాయకత్వం పట్ల ప్రజల్లో అవిశ్వాసాన్ని సృష్టించే లక్ష్యంతో లంకా వంటి ద్రోహులతో మానసిక దాడి చేయిస్తున్నాడు. లంకా ఎవరి పక్షాన నిలిచి ఈ దాడి చేస్తున్నాడో పాఠకులు లోతుగా ఆలోచించాల్సిన అవసరం ఉంది.

## భారత సమాజం పెట్టుబడిదారీ సమాజంగా మారిపోయిందా?

భారత ఆర్థిక వ్యవస్థ పెట్టుబడిదారీ విధానంగా రూపాంతరం చెందిందనీ, కాబట్టి దేశంలో దీర్ఘకాలిక ప్రజాయుద్ధానికి కాలం చెల్లిపోయిందని, వ్యూహం మార్చుకోవాలని పార్టీ రహస్యంగా ఉండరాదని, బహిరంగ పోరాటాలు చేయాలని జినుగు ముఖ్య వాదన. దీంతో పాటు పార్టీ విశాల ప్రజానీకంలోకి పోవడం లేదని, పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం లేదని కూడా జినుగు ఆరోపించాడు.

జినుగు విప్లవోద్యమంలో ఎదురైన సవాళ్లను ఎదుర్కోవడంలో విఫలమై, సుదీర్ఘకాలం నుండి పార్టీ శ్రేణులకు, ప్రజలకు దూరమై, కేంద్రీకృత ప్రజాస్వామ్యానికీ, క్రమశిక్షణాయుతమైన విప్లవ జీవితానికి దూరమై, సుఖాపేక్ష పెరిగి, శత్రు దాడికి భీతిల్లి హతాశుడై విప్లవోద్యమాన్ని విడిచి శత్రువు ముందు మోకరిల్లిన తర్వాతనే ఆయనకు భారత విప్లవానికి దీర్ఘకాల ప్రజాయుద్ధ పంథా పనికి రాదనే విషయం, బహిరంగ పోరాటాలు చేయాలనే విషయం గుర్తుకు వచ్చింది.

భారతదేశ ఆర్థిక వ్యవస్థ అర్ధవలస, అర్ధ-భూస్వామ్యంగా లేదనీ, ప్రస్తుతం అది 'భూస్వామ్య విధానం' గుణాత్మకంగా మారిపోయిందనీ, ప్రస్తుతం వ్యవసాయ రంగంలో పెట్టుబడిదారీ ఉత్పత్తి సంబంధాలు ఏర్పడ్డాయనీ, దేశంలో ఉత్పత్తి విధానం పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంగా మారిందన్న వాదన జినుగు శత్రువుకు లొంగిపోయి వాడికి విధేయుడైన ఏజెంటుగా మారడానికి చాలా కాలంగా ముందు నుంచే కొనసాగుతున్నది. ఇది జినుగు కొత్తగా కనిపెట్టిన సిద్ధాంతమేమీ కాదు. నేడు దీనిని ఇంటెలిజెన్స్ అధికారులు ద్రోహి జినుగుతో నకలు కొట్టించారు.

భారత సమాజం అర్ధవలస, అర్ధ-భూస్వామ్య సమాజమనీ ఇక్కడ దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథా ద్వారా నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయడం తక్షణ లక్ష్యమనీ సోషలిజం-కమ్యూనిస్టు స్థాపించడం అంతిమ లక్ష్యమనీ మన పార్టీ-సీపీఐ (మావోయిస్టు) దృఢంగా భావిస్తున్నది. దేశంలో, ప్రపంచంలో మారే పరిస్థితులకు అనుగుణంగా ఎంఎల్ఎం వెలుగులో అన్ని విషయాల్లోనూ, అన్ని రంగాల్లోనూ సృజనాత్మకంగా పనిచేస్తూ స్వతంత్ర విప్లవ పంథాను అవలంబిస్తుందనీ, విప్లవ మార్గంలో ఎన్ని కష్టాలు, మలుపులు-మెలికలు ఎదురైనా శత్రుసేనలను దునుమాడుతూ, ఇలాంటి ద్రోహులను పక్కకు తోసివేస్తూ విప్లవాన్ని విజయవంతం చేస్తుందనీ మన పార్టీ ప్రకటిస్తున్నది.

ఒక ఉత్పత్తి విధానం పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానమా లేదా భూస్వామ్య ఉత్పత్తి విధానమా అనేది నిర్ధారించేందుకు, అదనపు శ్రమను దోచుకోవడానికి గల పునాదిని

గురించి మార్క్స్ పేర్కొంటారు. ఆయన మాటల్లో, "..... భూస్వామి ఆదాయం, దాన్ని ఏ విధంగా పిలిచినప్పటికీ, అతడు తనకు వీలైనంతగా దోచుకున్న అదనపు ఉత్పత్తే అది. దోచుకునేందుకు అమలులో ఉన్న సాధారణ రూపం అది. అక్కడ మొత్తం వేతనం చెల్లించని అదనపు-శ్రమను నేరుగా దోచుకోవడం జరుగుతుంది. భూసంపద (landed property) అటువంటి దోపిడికి పునాదిగా ఉంటుంది." (మార్క్స్ పెట్టుబడి-సంపుటి-3, పేజీ 804).

భూస్వాములు నిర్వహించే వ్యవసాయం అనివార్యంగా పెట్టుబడిదారీ స్వభావం కలిగి ఉందని పైపై నిర్ధారణ చేయడం సరైంది కాదు. మార్క్స్ స్పష్టం చేసిందేమంటే, భూస్వామ్య ఉత్పత్తి విధానం, భూస్వాముల వైఖరి, కౌలును దోచుకోవడం, మొదలైనవి పెట్టుబడిదారీ ఉత్పత్తికి భిన్నమైనవి. అటువంటి సందర్భంలో, "అటువంటి దోపిడికి పెట్టుబడి మదుపు పెట్టడం" కాకుండా, "భూసంపద" పునాదిగా ఉంటుంది. ఇక్కడ అదనపు ఉత్పత్తి అదనపు విలువగా కాకుండా కౌలుగా వ్యక్తమవుతుంది. డబ్బు చెల్లింపు, స్వేచ్ఛాయుత కార్మికులను లేదా దాసులను నియమించడం, భూస్వాముల యాజమాన్యం కింద ఉత్పత్తి సాధనాలు ఉండడం మొదలైనవి పైకి కనపడడానికి పెట్టుబడిదారీగా ఉన్నా, నిజానికి అవి భూస్వామ్య ఉత్పత్తి విధానానికి సంబంధించినవి. మనం గుర్తుంచుకోవాల్సింది ఏమంటే, పెట్టుబడి కాకుండా 'భూసంపద' భూస్వామ్య దోపిడికి పునాదిగా ఉంటుంది.

పెట్టుబడిదారీ వ్యవసాయంలో పెట్టుబడిదారుడు అప్పుగా తీసుకొచ్చిన డబ్బును మదుపుగా పెట్టి ఉత్పత్తి సాధనాలను కొనుగోలు చేస్తాడు లేదా అద్దెకు తీసుకొస్తాడు, భూమిని కొనుగోలు చేస్తాడు లేదా పరమ భూమి కౌలు (absolute ground rent), తారతమ్య భూమి కౌలు (differential ground rent)పై ఆధారపడి భూమిని లీజుకు తీసుకుంటాడు. పెట్టుబడి మదుపు నుంచి కార్మికులు చేసిన పనికి వేతనాలు చెల్లించడం, ఉత్పత్తి ఖర్చుల భాగాన్ని చెల్లించడం పూర్తి అయిన తర్వాత అదనపు విలువ ఉత్పత్తి అవుతుంది. వ్యవసాయ కార్మికులు సృష్టించిన అదనపు విలువను వ్యవసాయ పెట్టుబడిదారుడు, భూస్వామి పంచుకుంటారు. వ్యవసాయ పెట్టుబడిదారుడు భూస్వామికి చెల్లించే అదనపు విలువను కౌలు అంటారు. వ్యవసాయ రంగంలో అంగ నిర్మాణం తక్కువ ఉంటుంది కనుక సరుకు విలువ సాధారణంగా ఉత్పాదక వ్యయం కంటే హెచ్చుగా ఉండి, లాభం రేటు ఎక్కువగా ఉంటుంది. భూమిపైన గుత్తాధిపత్యం వలన ఇతర రంగాల నుండి పెట్టుబడి స్వేచ్ఛగా వ్యవసాయ రంగంలోకి ప్రవేశించలేదు. అందువలన వ్యవసాయ రంగంలోని అధిక అదనపు విలువ అదే రంగంలో ఉండిపోతుంది. గమనించదగిన విషయమేమిటంటే, పెట్టుబడిదారీ వ్యవసాయంలో భూమి కౌలు అనేది అమలులో ఉన్నప్పటికీ, ఇక్కడ అదనపు విలువలో ప్రతిబింబించినట్టుగానే, ఉత్పత్తికి భూమి కాకుండా, పెట్టుబడి పునాదిగా ఉంటుంది.

నిజానికి కౌలు అనేది మౌలికంగా ఫ్యూడల్ కౌలు రూపం. భూస్వామి తన భాగాన్ని "ప్రత్యేకించి తన భూ యాజమాన్యం ప్రాతిపదికన" కోరుతాడు. భారత అర్ధ-భూస్వామ్య వ్యవస్థలో అదనపు

విలువను దోచుకునే పద్ధతిని అర్థం చేసుకోవడానికి మార్క్స్ చెప్పిన ఈ కింది ఉల్లేఖన తోడ్పడుతుంది, "భూమి కౌలుకు సంబంధించిన ఈ అన్ని రూపాలలో – శ్రమ కౌలు (labour rent) కావచ్చు, వస్తు రూప కౌలు (rent in kind) కావచ్చు లేదా నగదు రూప కౌలు (money-rent) (ఇది వస్తు రూప కౌలుకు మరో రూపం మాత్రమే) కావచ్చు – చెల్లించబడే కౌలు ఎల్లప్పుడూ నిజంగా సాగుచేసిన రైతే చెల్లిస్తాడు. చెల్లించబడని ఇతని అదనపు-శ్రమ నేరుగా భూస్వామి చేతుల్లోకి వెళుతుంది. చివరి కౌలు రూపమైన, 'శుద్ధమైనది'గా చెప్పబడే డబ్బు-కౌలు సైతం వస్తు రూప కౌలుకు మరో రూపం మాత్రమే. ఇది సంభవమే కాక నిజానికి ఆ విధంగా జరుగుతుంది కూడా." (పై పుస్తకం, పేజీ 802).

అందువల్లనే భూస్వాములు పాలుకు వ్యవసాయం (share-cropping) చేయించేందుకు, ఇందులో మదుపు పెట్టేందుకు ఆసక్తి చూపుతారు. ఎందుకంటే అందులో సాపేక్షికంగా ఎక్కువ కౌలు లభిస్తుంది. అయితే రైతుకు పాలుకు వ్యవసాయం చేయడం పట్ల అంత ఆసక్తి ఉండదు. తనను భూమి నుంచి తొలగించవచ్చునని అతనికి తెలుసు. అందువల్ల భూమిపై ఎక్కువ మదుపు పెట్టేందుకు మొగ్గు చూపడు. భారతదేశంలో పరివర్తనా రూపం ఇది. దశాబ్దాల తరబడి స్వల్ప మార్పులతో కొనసాగుతూనే ఉంది.

పాలుకు వ్యవసాయం చేయడం అనేది అర్ధ-భూస్వామ్య దోపిడీ రూపం. కౌలు అనేది అదనపు విలువ సాధారణ రూపం కాదు. అటువంటి అర్ధ-భూస్వామ్య సంబంధాలు నెలకొని ఉన్న సమాజంలో తగినంత పెట్టుబడి లేకపోవడం వల్ల రైతు పెట్టుబడిదారీ రైతుగా పరివర్తన చెందలేదు. అటువంటి వ్యవసాయం – రైతులు తగినంత పెట్టుబడిని క్రమంగా సకాలంలో సమకూర్చుకున్నప్పుడు, దానిని మదుపుగా పెట్టి సృష్టించిన అదనపు విలువలో ఒక భాగాన్ని భూమి కౌలుగా భూస్వామికి చెల్లించి, మిగతా అదనపు విలువను తిరిగి మదుపు పెట్టినప్పుడు అది పెట్టుబడిదారీ రూపం తీసుకుంటుంది. అటువంటి పరివర్తన ఆచరణలో మన దేశంలో అసాధ్యం. వ్యవసాయ పెట్టుబడిదారీ విధాన అభివృద్ధి క్రమంతో పాటుగా భూమి కౌలు పెట్టుబడిదారీ కౌలుగా పరివర్తన చెందుతుందని అనడం కూడా సరైంది కాదు. ఒక్క మాటలో చెప్పాలంటే పైకి కనిపించే కొన్ని పెట్టుబడిదారీ అంశాలు ఆటోమేటిక్‌గా వ్యవసాయంలో పెట్టుబడిదారీ విధానం వైపుగా పరిణమించవు. భూమి దోపిడికి పునాదిగా ఉన్నంత వరకూ అర్ధ-భూస్వామ్య విధానం కూడా ఉంటుంది. ఇది పెట్టుబడిదారీ విధానంగా పరివర్తన చెందడానికి అనేక అడ్డంకులు ఉన్నాయి. అవి వ్యవస్థీకృతం అయి ఉన్నాయి. అందువల్లనే పరివర్తన చాలా పరిమితులలో సాగుతున్నది, వ్యవస్థీకృతంగా అవరోధాలను ఎదుర్కొంటున్నది. మన పార్టీ భారతదేశాన్ని అర్ధ-భూస్వామ్య వ్యవస్థ అని చెబుతున్నాదంటే, దాని అర్థం, మన దేశంలో బ్రిటిష్ కాలంలోనే భూమి సరుకుగా మారడం, పెట్టుబడి చొరబడడం వల్ల అది అప్పటి నుండే ప్రత్యేకంగా 1947 నుండి దేశంలో జరిగిన మార్పుల వల్ల అది శుద్ధ భూస్వామ్య వ్యవస్థగా లేదు అనేదే. ఇక్కడ సామ్రాజ్యవాదులు భారత బడా బూర్జువాలు భూస్వామ్యవర్గంతో రాజీపడ్డారు. అర్ధ-భూస్వామ్య వ్యవస్థలో భూస్వామ్య ఉత్పత్తి సంబంధాలు, వికృత పెట్టుబడిదారీ అంశాలు

మిళితమై ఉంటాయి. అందువల్ల అటువంటి అర్ధ-భూస్వామ్యం, వికృత పెట్టుబడిదారీ విధానం రెండూ ప్రజాస్వామిక విప్లవానికి శత్రువులే.

భారతదేశ జనాభాలో ఇప్పటికీ రైతాంగమే ప్రధానంగా ఉన్నారు. భూమి, వ్యవసాయ సాధనాలు భూస్వామ్య వర్గం చేతిలో కేంద్రీకృతమై ఉన్నాయి. ఆదివాసులు, నగర శివార్లలో రైతాంగ విస్థాపన విషయం చూస్తే రాజ్యం కూడా ఒక బడా భూస్వామిగా వ్యవహరిస్తున్నదని స్పష్టమవుతుంది. బ్రిటిష్ సామ్రాజ్యవాద దురాక్రమణ కారణంగా వక్ర రూపంలో ప్రారంభమైన పెట్టుబడిదారీ సంబంధాలు, బ్రిటిష్ కాలంలో కొనసాగిన వలస దోపిడీ, 1947 అధికార మార్పిడి తర్వాత నయావలస తరహా అర్ధవలస దోపిడీ తీవ్రతరం కావడంతో ఆ పెట్టుబడిదారీ సంబంధాలు మరింత వక్రంగా మారుతూ వచ్చాయి. ప్రధానంగా సామ్రాజ్యవాదులపై ఆధారపడి మన దేశంలో జరిగిన సాంకేతికతలో విపరీతమైన పెరుగుదల, ఆధునిక వస్తువుల వినిమయంలో పెరుగుదల, మేధోవలస ఇవన్నీ దేశ పరాధీనతను, సామ్రాజ్యవాదులకు దేశం మీద ఉన్న పట్టును తెలియజేస్తున్నాయి తప్ప దేశం స్వతంత్ర అభివృద్ధి మార్గాన్ని చేపట్టడాన్ని, అది పెట్టుబడిదారీగా మారిపోవడాన్ని ఎంత మాత్రం తెలియజేయడం లేదు.

ప్రత్యేకించి ప్రపంచీకరణ విధానాల తర్వాత మన దేశ ఆర్థిక వ్యవస్థలో భూస్వామ్య శక్తులకు, ప్రజలకూ మధ్య మౌలిక వైరుధ్యం తీవ్రతరం అయ్యిందే తప్ప అర్ధ భూస్వామ్య, అర్ధ వలస స్వభావం కలిగిన ఉత్పత్తి సంబంధాలలో మౌలిక మార్పు జరగలేదు. వందల వేల ఎకరాలు ఉన్న భూస్వాములు నేడు లేకపోయినప్పటికీ, భూమి సరుకుగా ఉన్నప్పటికీ ఎన్ఎస్ఎస్ఓ 70వ రౌండ్ (2012-13) గణాంకాల ప్రకారమే గ్రామీణ కుటుంబాలలో పై స్థాయిలోని 7 శాతం భూస్వామ్య, ధనిక రైతు కుటుంబాలు మొత్తం వ్యవసాయ భూమిలో దాదాపు సగం భూమిని కలిగి ఉన్నాయి. మిగతా 93% శాతం కింది స్థాయి కుటుంబాల వద్ద మిగిలిన సగం భూమి ఉన్నది. వ్యవసాయ ఆర్థిక వ్యవస్థపై భూస్వాముల, వడ్డీ వ్యాపారుల, వర్తకుల వర్గ ఆధిపత్యం ఉంది. వీరంతా భూస్వామ్య వర్గంలో భాగమే. వీరు తమ ఆధిపత్యాన్ని వినియోగించుకొని భూమిని, పరపతిని, మార్కెట్‌ను కంట్రోల్ చేస్తూ ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో అధికారికంగా కొనసాగే పలు వ్యాపార కార్యకలాపాలలో, అనధికారికంగా పలు రకాల మాఫియా కార్యకలాపాలలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థలోని అదనపు విలువను హస్తగతం చేసుకుంటున్నారు. దేశంలో బడా భూస్వామ్య, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ వర్గాలు విడదీసి చూడలేనంతగా ఎలా పెనవేసుకొని ఉన్నాయో అదే విధంగా వివిధ ఫైనాన్స్/చిట్‌ఫండ్ సంస్థలలో బడా భూస్వామ్య, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ వర్గాల పెట్టుబడి విడిదీయలేనంతగా కలిసిపోయి ఉంది. ఈ వర్గాలు వ్యవసాయంలో పెట్టుబడులు పెట్టేందుకు, ఉత్పాదక సామర్థ్యాన్ని అభివృద్ధి చేసేందుకు ఆటంకంగా ఉన్నాయి. ఎన్ఎస్ఎస్ గణాంకాలు, పలు క్షేత్ర స్థాయి అధ్యయనాలు సూచించేదేమంటే, భూమిలేని (వ్యవసాయ కూలీలతో సహా), పేద రైతులలో “భూమి కోసం డిమాండ్” పెరుగుతున్నది. వ్యవసాయంలో తిరిగి మదుపు పెట్టే ఆశ లేకుండా పోతోంది. 1980ల నుంచి కౌలుదారీ విధానం, వడ్డీ వ్యాపారం, వర్తక పెట్టుబడి పెద్దెత్తున పెరిగిపోవడం

వల్ల వ్యవసాయ చట్రంలో మౌలికమైన మార్పు సంభవించలేదు.

దేశ వ్యవసాయ ఆర్థిక వ్యవస్థలో సరళమైన అమ్మకపు సరుకులను ఉత్పత్తి చేసే చిన్న, మధ్య తరహా రైతుల వ్యవసాయమే ప్రాబల్యాన్ని కలిగి ఉంది. చిన్న భూకమతాలు కలిగి ఉన్న కుటుంబాల సంఖ్య పెరుగుతున్నది. వీరు మార్కెట్ కోసం ఉత్పత్తి చేసినప్పటికీ, రైతులు తమ అవసరాలు తీర్చుకోవడానికే తమ ఉత్పత్తిని అమ్ముకుంటారు. చిన్న మధ్య తరహా వ్యవసాయం, నాన్-ఫారం లఘు ఉత్పత్తి ప్రాబల్యం, విరామం లేకుండా వ్యవసాయ కార్మికులు ఉపాధి కోసం వివిధ రంగాలకు మారడం మొదలైనవి పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానాన్ని కాక అర్ధ-భూస్వామ్య విధానాన్ని సూచిస్తున్నాయి. వ్యవసాయ కార్మికులకు వేతనం ద్వారా లభించే ఆదాయం పెరగడాన్ని బట్టి మాత్రమే ఇది పెట్టుబడిదారీ విధానంగా వర్గీకరించే పద్ధతి తప్పుడు పద్ధతి అవుతుంది. ఎందుకంటే వ్యవసాయంలో పెట్టుబడి కేంద్రీకరణ అదనపు విలువను సృష్టించడం కోసం కాకుండా ఎక్కువగా వ్యాపారం, రియల్ ఎస్టేట్, వడ్డీ వ్యాపారం మొదలైనవాటిలో వినియోగిస్తున్నారు లేదా హోదా కోసం, విలాసాల కోసం వృధాగా ఖర్చు చేస్తున్నారు. దేశంలో పెడుతున్న మొత్తం మదుపుతో పోల్చి చూస్తే వ్యవసాయంలో పెడుతున్న మదుపు 1980ల నాటితో పోల్చి చూస్తే 2000 నాటికి గణనీయంగా 18 నుంచి 6 శాతానికి తగ్గిపోయింది. భూస్వామ్య వర్గం దోపిడీ చేసిన మొత్తం అదనపు విలువలో సుమారు 10.5 శాతం మాత్రమే తిరిగి మదుపు పెడుతున్నది. కేంద్ర ప్రభుత్వ తప్పుడు ద్రవ్య విధానం, వ్యవసాయ విధానం ఫలితంగా ఈ పరిణామం మరింత విషమించింది. చిన్న భూకమతాల సంఖ్య పెరగడం, వ్యవసాయంలో పెట్టుబడి సంచయనం తగ్గిపోవడం అనే ధోరణి వ్యవసాయంలో పెట్టుబడిదారీ అభివృద్ధిని ఎంతమాత్రమూ సూచించదు.

గ్రామీణ ప్రాంతంలో కార్మిక శ్రమశక్తి ఒక సరుకుగా మారిపోయినప్పటికీ వ్యవసాయ కార్మికులు పెట్టుబడిదారీ విధానంలోని స్వేచ్ఛా కార్మికులుగా కాకుండా అర్ధస్వేచ్ఛా కార్మికులుగా ఉన్నారు. రోజు కూలీలను వినియోగించి సాగు చేయడం ప్రధాన మిగులు సేకరణ పద్ధతిగా మారినప్పటికీ వ్యవసాయంలో పెట్టుబడి సంచయనమే తగ్గిపోవడం వల్ల ఉపాధి దొరకడం కూడా తగ్గిపోయింది. ఉపాధి లభించే సీజన్‌లో కార్మికులకు వేతన చెల్లింపులు వ్యక్తిగత పునాది మీద కాకుండా కుటుంబాల కాంట్రాక్టు పునాదిగా జరుగుతాయి. గతంలో లాగా జీతగాళ్ల పద్ధతి, వారి సంఖ్య నేడు చాలా తగ్గిపోయినా పలు రూపాలలో వెట్టిచాకిరి కొనసాగుతూనే ఉంది. ఇవన్నీ అర్ధ-భూస్వామ్య సంబంధాలనే తెలియజేస్తున్నాయి తప్ప పెట్టుబడిదారీ సంబంధాలను కాదు.

దేశంలో 2014-18 మధ్య పారిశ్రామిక రంగం వృద్ధి రేటు 8.2 శాతం నుంచి 4.4 శాతానికి, వ్యవసాయ వృద్ధి రేటు 4.2 శాతం నుంచి 2.1 శాతానికి పడిపోయింది. జీడీపీలో వీటి వాటా రోజు రోజుకూ పడిపోతుండగా, సర్వీసు రంగం వాటా పెరుగుతున్నది. ఈ సర్వీసు రంగ అభివృద్ధి కూడా స్వతంత్ర ఆర్థికాభివృద్ధిలో భాగంగా కాకుండా వెయిన్నొక్క

రకాలుగా సామ్రాజ్యవాదులపై ఆధారపడినదే. ఇది వికృత పెట్టుబడిదారీ అభివృద్ధి లక్షణాన్నే సూచిస్తుంది. కానీ సేవరంగం కూడా సారాంశంలో పెట్టుబడి రంగమే కనుక దేశంలో పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెందిందని జినుగు అపర 'మార్క్సిస్టు' పాఠాలు చెబుతున్నాడు. జినుగు మతిచెలించి దేశంలో సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీల విచ్చలవిడి దోపిడీ, ఆధిపత్యం కొనసాగుతున్నప్పటికీ దేశం పెట్టుబడిదారీ దేశమే అంటున్నాడు. అడ్డదిడ్డంగా, వక్రంగా పెరిగిన పెట్టుబడిదారీ సంబంధాలనే పెట్టుబడిదారీ విధానం అని 'శిశువు అంగవైకల్యంతో పుట్టినంత మాత్రాన మానవ శిశువు కాకుండా పోదని' అంటున్నాడు. ఈ అర్ధవలస, అర్ధ-భూస్వామ్య వ్యవస్థలో పారిశ్రామిక వృద్ధిని అడ్డుకుంటున్నది సామ్రాజ్యవాదం, భూస్వామ్యంతో మిలఖత్ అయిన దళారీ నిరంకుశ బూర్జువా వర్గమేనన్న వాస్తవాన్ని మరుగుపరచాలని చూస్తున్నాడు. ఎందుకంటే వ్యవసాయ, వ్యవసాయేతర వలస కార్మికుల సంఖ్య పెద్దెత్తున పెరగడం పెట్టుబడిదారీ అభివృద్ధిని ఎంతమాత్రమూ ప్రతిబింబించదు. అర్ధవలస, అర్ధ-భూస్వామ్య వ్యవస్థలోని సంక్షోభ ఫలితంగా ప్రత్యేకంగా వ్యవసాయ సంక్షోభం ఫలితంగా వ్యవసాయ కార్మికుల, పేద, మధ్యతరగతి రైతులు పట్టణాలకు వలసపోవాల్సిన స్థితికి నెట్టబడుతున్నారు. కానీ ఈ భారీ వలస వ్యవసాయ, వ్యవసాయేతర కార్మిక శక్తిని ఇముడ్చుకునేలా దేశంలో పారిశ్రామిక వృద్ధి లేదు. నిజానికి సామ్రాజ్యవాదం అర్ధభూస్వామ్యాన్ని సామాజిక ఆధారంగా చేసుకొని, దళారీ నిరంకుశబూర్జువా వర్గంతో కుమ్మక్కై దేశాన్ని అర్ధవలసగా మార్చి పెద్దెత్తున దోచుకోవడం, గ్రామీణ ప్రాంతంలో అర్ధ-భూస్వామ్య సంబంధాల ప్రాబల్యం, దుర్భర దారిద్ర్యం ఫలితంగా దేశీయ మార్కెట్‌కు ఏర్పడిన పరిమితి పారిశ్రామిక అభివృద్ధి జరగకపోవడానికి అసలు కారణాలు.

సామ్రాజ్యవాదం తన మార్కెట్ ప్రయోజనాల కోసమే మన దేశంలో వ్యవసాయంలో 'హరిత విప్లవాన్ని' తీసుకొచ్చింది తప్ప వ్యవసాయంలో పెట్టుబడిదారీ విధానాన్ని ప్రవేశపెట్టడం దాని ఉద్దేశ్యం కాదు. దాని వల్ల పెట్టుబడిదారీ సంబంధాలు కొన్ని ప్రాంతాల్లో సాపేక్షికంగా అభివృద్ధి చెందినప్పటికీ అవి బాగా వక్రంగా, వికృతంగా ఉందనేది వస్తుగత వాస్తవం. నిజానికి వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు అమలులోకి వచ్చినప్పటికీ, అవి వ్యవసాయ సంబంధాలను గుణాత్మకంగా అభివృద్ధి చేయలేకపోతున్నాయి. దీని వల్ల రైతాంగం సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీల, దేశంలోని దళారీ పెట్టుబడిదారీ కంపెనీల విష వలయంలో మరింతగా చిక్కుకొనిపోయింది. వ్యవసాయ ఖర్చులు విపరీతంగా పెరిగిపోవడం, గ్రామీణ రుణం భారీగా పెరిగిపోవడం, క్రూరమైన వడ్డీ వ్యాపార దోపిడీ, వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు లేకపోవడం వల్ల వ్యవసాయ రంగం కోలుకోలేని సంక్షోభంలో కూరుకుపోయింది. రైతులు బతకలేక ఆత్మహత్య చేసుకుంటున్నారు.

గ్రామీణ జనాభా పెద్దెత్తున నిర్వాసితులై పట్టణాలకు వలసపోవడంతో పట్టణ జనాభాలో పెరుగుదల ఉంది. అయితే పట్టణాలలో ఈ గ్రామీణ వలస జనాభాకు అక్కడ తగిన ఉపాధి అవకాశాలు లభించక తిరిగి గ్రామాల బాట పట్టడం, ఈ 'రిజర్వు సైన్యం' భూమిని కౌలుకు

తీసుకొని సాగు చేసే కౌలు మార్కెట్‌లోకి వెళుతుండడంతో దేశంలో కౌలుదారీ వ్యవసాయం పెరగడం కూడా స్పష్టంగా కనపడుతున్నది. నిజానికి మన దేశంలో పట్టణ ప్రాంతాలలో నిరుద్యోగం, అర్ధఉద్యోగిత చాలా తీవ్రంగా ఉంది. ఈ వాస్తవాన్ని మరుగుపరిచి గ్రామీణ ప్రాంతం నుండి పట్టణాలకు వ్యవసాయ కార్మికులు పెద్దెత్తున వలస పోవడం వల్ల వ్యవసాయ రంగంలో పనులకు కూలీలు దొరకని పరిస్థితి ఏర్పడడం, తత్ఫలితంగా యంత్రాలతో, చివరకు డ్రోన్లను సైతం వినియోగించి వ్యవసాయం చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని జినుగు మాట్లాడుతున్నాడు.

సామ్రాజ్యవాద ప్రాపకంలో పెరిగిన భారత దళారీ దోపిడీ పాలకవర్గాలు సామ్రాజ్యవాదులకు సేవచేస్తూ తమ ప్రయోజనాలను నెరవేర్చుకుంటున్నాయి. వీరు కొన్ని ఆసియా, ఆఫ్రికా దేశాలలో పెట్టుబడి పెట్టడం, వాటి మార్కెట్‌లోకి ప్రవేశించడాన్ని చూసి భారతదేశం పెట్టుబడిదారీగా మారిపోయిందనీ, అది సామ్రాజ్యవాద దేశంగా కూడా మారే అవకాశం లేకపోలేదనీ జినుగు ప్రజల్ని భ్రమింపజేయాలని చూస్తున్నాడు.

దేశాన్ని పట్టి పీడిస్తున్న బ్రాహ్మణీయ హిందూ కులాధారిత భూస్వామ్య వ్యవస్థలో దోపిడీ, కులపీడన, వివక్ష, అణచివేత కొనసాగుతుండగా ఈ వ్యవస్థకు కొమ్ము కాయదలుచుకున్న జినుగు దేశం పెట్టుబడిదారీగా మారిన ఫలితంగా పునాదిలో కులవ్యవస్థ బాగా బలహీనపడిందని ప్రజల్ని మోసగించ జూస్తున్నాడు. అలాగే కార్మికులు, రైతులు, పెటీబూర్జువా సెక్షన్లయిన మహిళలు, విద్యార్థులు, మేధావులు, వివిధ వృత్తికారులు, ఉద్యోగులు భూస్వాముల దోపిడీకి గురికావడం లేదనీ, దళారీ పెట్టుబడిదారుల దోపిడీకి గురవుతున్నారని, దేశంలో తీవ్రంగా మత మూఢత్వం, అశాస్త్రీయ అంధవిశ్వాసాలు ఆధిపత్యంలో ఉన్నంత మాత్రాన ఇది అర్ధ–భూస్వామ్య సమాజం కాదని, పెట్టుబడిదారీ సమాజంలోనే కాకుండా, నూతన ప్రజాస్వామిక విప్లవం విజయవంతమైన తర్వాత కూడా చాలా కాలం ఇవి బలంగానే ఉంటాయని అనడం, ఇవి ఉన్నంత మాత్రాన దేశం పెట్టుబడిదారీగా కాకుండా పోదని, పెట్టుబడిదారీ దేశాలలో ప్రజాస్వామిక హక్కులు నేతిబీరకాయిలో నెయ్యి లాంటిదేననీ, అక్టోబర్ విప్లవం ముందునాటి రష్యాలో కూడా ప్రజాస్వామిక హక్కులు లేవనీ అంటూ భారతదేశంలో ప్రజాస్వామిక హక్కులు లేకపోతే అది పెట్టుబడిదారీ దేశం కాకుండా పోదని జినుగు వితండవాదం చేయడం అంటే దీని వెనుక శత్రువు రూపొందించిన పెద్ద పథకమే ఉందని ఎవరైనా అర్థం చేసుకుంటారు.

మన పార్టీ నాయకత్వంలో సాగిన లేదా మద్దతుతో సాగిన ప్రజా పోరాటాలన్నీ భూస్వామ్య వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక, దేశ దోపిడీ పాలకవర్గాలకు ప్రాతినిధ్యం వహించే రాజ్యానికి వ్యతిరేకంగా సాగిన పోరాటాలు కాగా, అవన్నీ కేవలం 'పెట్టుబడిదారీ దోపిడికి, రాజ్య దోపిడీ, అణచివేతకు వ్యతిరేక పోరాటాలుగా', ఆంధ్ర ప్రాంత పాలకవర్గాలకు వ్యతిరేకంగా సాగిన ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమాన్ని 'కోస్తా బడా పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా సాగిన ఉద్యమంగా', దేశంలో కొనసాగుతున్న కశ్మీర్, ఈశాన్య జాతుల విముక్తి పోరాటాలు కూడా 'భారత పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటాలుగా' జినుగు ప్రవచిస్తున్నాడు.

చాలా కాలం నుండే దేశ ఆర్థిక వ్యవస్థ పెట్టుబడిదారీ విధానంగా మారిందని చెప్పి విప్లవానికి ఎనలేని ద్రోహం చేసిన పాత, కొత్త రివిజనిస్టు పార్టీల దుస్థితి నేడు ఏ విధంగా ఉందో జగమెరిగిన సత్యం. జినుగు భారతదేశం అర్ధవలస, అర్ధ-భూస్వామ్య దేశం అనే భౌతిక వాస్తవికతను వక్రీకరించి ఇది పెట్టుబడిదారీ దేశంగా మారిందనడం నేడు దేశంలో కొనసాగుతున్న దీర్ఘకాల ప్రజాయుద్ధాన్ని నీరుగార్చడానికి ఒక పథకం ప్రకారం చేస్తున్న దాడే తప్ప మరేంకాదు. ఆయన విప్లవ ఆచరణ నుంచి వైదొలిగి దోపిడీ వర్గాలకు సేవ చేయాలని నిర్ణయించుకున్న తర్వాతనే, ఉద్దేశ్యపూర్వకంగానే, ఎంఎల్ఎం విశ్వజనీన సిద్ధాంతాన్ని, సామాజికాభివృద్ధి నియమాలను, సుదీర్ఘ ప్రపంచ కార్మికవర్గ/సోషలిస్టు వర్గ పోరాట చరిత్ర అందించిన సుసంపన్నమైన అనుభవాలను పక్కకు పెట్టి తిమ్మిని బమ్మి చేస్తూ 'భారతదేశం పెట్టుబడిదారీగా మారిందనే' వాదనను, తద్వారా దీర్ఘకాల ప్రజాయుద్ధ పంథాకు కాలంచెల్లిందనే వాదనను ముందుకు తెచ్చాడు. భూస్వామ్య విధానాన్ని, భూస్వామ్య వర్గ ఉనికినే గుర్తించకుండా దళారీ నిరంకుశ బూర్జువా వర్గాన్నీ ఒక స్వతంత్ర పెట్టుబడిదారీ వర్గంగా, ఈ దేశాన్ని ఒక పెట్టుబడిదారీ దేశంగా తద్వారా ఈ దేశంలో నెలకొనివున్న వర్గ సంబంధాలను వర్గ వైరుధ్యాలను ఘోరంగా వక్రీకరించి ఆయన చేస్తున్న అసంఖ్యాకమైన ప్రేలాపనలకు 'భారత్ నేడు పెట్టుబడిదారీ దేశమే-సార్వత్రిక తిరుగుబాటు పంథానే' అనే పేరుతో ఆయన ముందుకు తెచ్చిన కుతర్కమే ఇందుకు నిదర్శనం. ఈ విధంగా వక్ర పెట్టుబడిదారీ సంబంధాలను సైతం పెట్టుబడిదారీ విధానమేనంటూ జినుగు మార్క్సిజాన్ని వక్రీకరిస్తున్నాడు. పీడిత వర్గ ప్రయోజనాల కోసం ఆవిర్భవించిన మార్క్సిజాన్ని దోపిడీ వర్గాల, అభివృద్ధినిరోధకుల, తన లాంటి విప్లవ ప్రతీఘాతకుల ప్రయోజనాల కోసం వినియోగించుకోవాలని విఫల ప్రయత్నం చేస్తున్నాడు.

అందువల్లనే ఆయన ప్రజలను కూడగట్టి బహిరంగ పోరాటాలు చేయాలని మాట్లాడడం మొదలు పెట్టాడు. 21వ శతాబ్దంలో ముఖ్యంగా ప్రపంచీకరణ విధానాలు అమలులోకి వచ్చిన తర్వాత నుంచి అంతర్జాతీయంగా, దేశీయంగా పరిస్థితులలో పలు మార్పులు వచ్చాయి. ప్రజలు పలు సమస్యలపై పెద్దెత్తున పాక్షిక ఉద్యమాలలోకి వస్తున్నారు. ఈ నేపథ్యంలో వారిని పెద్దెత్తున ప్రజా పోరాటాలలో సమీకరించాల్సిన అవసరం మరింత ఎక్కువగా ఉంది. నిజానికి ప్రజల విప్లవ శక్తిని వెలికితీయడంలో, వారిని ప్రజాయుద్ధంలోకి సమీకరించడంలో బహిరంగ/చట్టబద్ధ పోరాటాలు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. తమ దైనందిన, మౌలిక సమస్యల మీద చేపట్టే బహిరంగ/చట్టబద్ధ పోరాటాల ద్వారా ప్రజల సంఘటిత విప్లవశక్తి బయటకు వస్తుంది. ఈ బహిరంగ, చట్టబద్ధ పోరాటాలు ప్రజాయుద్ధంలో ప్రజలకు రిహార్సల్స్‌లాగా తోడ్పడతాయి, విప్లవ లక్ష్యాన్ని స్పష్టం చేస్తాయి. వారిని ప్రజాయుద్ధంలోకి సమీకరిస్తాయి. అయితే బహిరంగ పోరాటాలే సర్వస్వం అనే వాదన అర్థంలేనిది. బహిరంగ పోరాటాలు దోపిడీ వర్గాలపై కొంతవరకు ఒత్తిడి తెస్తాయి తప్ప వాటిని కూలదోయలేవు, ప్రజావిముక్తికి మౌలికంగా అవసరమైన ప్రజాస్వామిక రాజ్యాధికారాన్ని నెలకొల్పలేవు, ప్రజల మౌలిక సమస్యలు పరిష్కారం కావు.

కార్మికవర్గ నాయకత్వంలో పీడిత ప్రజలు రాజ్యాధికారం కోసం సాగించే పోరాటం చాలా

తీవ్రంగా, కఠినంగా, క్రూరంగా ఉంటుంది. వినతి పత్రాలకు, ప్రజా ప్రదర్శనలకు వెరచి దోపిడీ పాలకవర్గాలు తమ రాజ్యాధికారం వదులుకోవడానికి ఇష్టపడవు. అవి రాజ్యాధికారాన్ని గుంజుకునేందుకు విప్లవించే ప్రజలపై ఎంతకైనా తెగిస్తాయి. ప్రజలకు ప్రజాసైన్యం లేకుండా బహిరంగ పోరాటాల ద్వారా మాత్రమే ప్రత్యేకించి అర్ధవలస, అర్ధ-భూస్వామ్య వ్యవస్థలో దోపిడీవర్గాలను ఎదుర్కోవడం, వాటిని కూలదోయడం, రాజ్యాధికారాన్ని గుంజుకోవడం సాధ్యం కాదు. అందువల్ల సామ్రాజ్యవాదానికి, భూస్వామ్యానికి, దళారీ నిరంకుశ బూర్జువా వర్గానికి వ్యతిరేకంగా, దానికి ప్రాతినిధ్యం వహించే రాజ్యానికి వ్యతిరేకంగా వారు ప్రజాయుద్ధం సాగించడం అనివార్యం. పార్టీ రహస్యంగా ఉంటేనే ప్రజలకు కార్మికవర్గ అగ్రగామిగా సుదీర్ఘ కాలం నాయకత్వం వహించగలుగుతుందని రష్యా, చైనా విప్లవాల అనుభవాలు నిరూపించాయి. విప్లవానికి నీళ్లొదిలి శత్రు శరణు జొచ్చిన జినుగు లాంటి ద్రోహులు దేశంలో ప్రజాసైన్య నిర్మాణమే సాధ్యం కాదని మాట్లాడడం క్రూరమైన, పాశవికమైన దేశ దోపిడీ పాలకవర్గాల ముందు ప్రజలను నిరాయుధం చేసే కుట్ర తప్ప మరొకటి కాదు. విప్లవమంటే వణికిచచ్చే ఈ మావోయిస్టు క్విగ్లాట్ సార్వత్రిక పంథా గురించి ప్రేలాపనలు చేస్తున్నాడు.

అలాగే జినుగు పార్టీ విశాల ప్రజానీకంలోకి వెళ్లడం లేదని బురద జల్లుతున్నాడు. అలలు అలలుగా పురోగమించే దీర్ఘకాలిక ప్రజాయుద్ధంలో ప్రజా సమీకరణలో ఉండే మార్పులను గురించి ఓనమాలు కూడా వొంటబట్టించుకోని సరెండర్డ్ మావోయిస్టు నాయకుడు జినుగు విశాల ప్రజల్లోకి పార్టీ వెళ్లడం లేదంటూ దురుద్దేశ్యపూర్వకంగా దాడి చేస్తున్నాడు.

సీపీఐ (మావోయిస్టు) నిర్మాణం తర్వాత కూడా గత 15 యేళ్ల ఉద్యమ చరిత్రను పరిశీలించినా స్పష్టమవుతుంది. పార్టీ నాయకత్వంలో పీఎల్‌జీఏ, ప్రజా నిర్మాణాలు ఎర్రప్రతిఘటనా ప్రాంతాలలో, గెరిల్లాజోన్లలో పెద్దెత్తున ప్రజలను సమీకరిస్తూ తీవ్రతరం చేసిన భూస్వామ్య వ్యతిరేక సాయుధ వ్యవసాయ విప్లవ వర్గ పోరాటం, సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీలతో దేశ దళారీ పాలకవర్గాల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఎంఓయుల ఫలితంగా లక్షలాది ఆదివాసీ, గైరాదివాసీ, పట్టణ పేదల విస్థాపనకు వ్యతిరేకంగా పశ్చిమ బెంగాల్‌లో సింగూర్, నందిగ్రాం, లాల్‌గఢ్, ఒడిశాలో కళింగనగర్, నియంగిరి, నారాయణపట్నా వంటి పలు ప్రజా విజృంభణలు, అభయారణ్యాలకు వ్యతిరేకంగా పోరాటాలు, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం మలిదశలో సాగిన ప్రజా వెల్లువ, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఝార్ఖండ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో వివిధ గనులు, ప్రాజెక్టులకు వ్యతిరేకంగా పెద్దెత్తున సాగిన ప్రజా పోరాటాలు, ఝార్ఖండ్‌లో సీఎన్‌టీ-ఎస్‌పీటీ చట్టాన్ని సవరించడానికి వ్యతిరేకంగా గత 3-4 సంవత్సరాలు నుంచి కొనసాగుతున్న విశాల ఆదివాసీ ప్రజా పోరాటం, పలు రాష్ట్రాలలో రాజ్యహింసకు వ్యతిరేకంగా, దళితులపై, మహిళలపై, ముస్లిం మతమైనారిటీలపై సాగుతున్న అత్యాచారాలకు వ్యతిరేకంగా కొనసాగుతున్న పలు ఉద్యమాలు, రైతాంగ, కార్మిక విద్యార్థి, మహిళా ఉద్యమాలు మొదలైనవి విశాల ప్రజానీకంలో పార్టీ పెనవేసుకొని ఉందనడానికి తిరుగులేని నిదర్శనాలు. ఇదే సమయంలో ఈ 15 యేండ్లలో దేశ ఫాసిస్టు పాలకవర్గాలు సాగించిన వ్యూహాత్మక అణచివేత క్యాంపెయిన్ల

ఫలితంగా పార్టీకి పలు రాష్ట్రాలలో జరిగిన నష్టాల వల్ల, ప్రత్యేకించి నాయకత్వానికి జరిగిన నష్టాల వల్ల విశాల ప్రజారాశులలో పార్టీ కృషికి తీవ్ర అంతరాయం ఏర్పడిన మాట వాస్తవమే. దీనిని అధిగమించాల్సిన అవసరం ఉంది. దీర్ఘకాలిక ప్రజాయుద్ధ క్రమంలో తాత్కాలికంగా ఎదురయ్యే నష్టాలను, ప్రజా సమీకరణలో కలిగే ఇబ్బందులను, ఉద్యమ వెనుకంజలను చూసి ప్రజా శత్రువులు, జినుగు లాంటి శత్రు తొత్తులు ఎంతగా మురిసిపోయినా అప్రతిహతమైన ప్రజాయుద్ధ సంరంభంలో వీరంతా గడ్డిపరకల్లాగా కొట్టుకపోవడం విప్లవ విజయం అనివార్యం. ఇది సామాజిక నియమం. చారిత్రక సత్యం.

తీవ్రమైన అరాచకవాద తదితర కార్మికవర్గేతర ధోరణులతో కొట్టుకొనిపోతూ వీటిపై నిజాయితీగా ఎన్నడూ ఆత్మవిమర్శ చేసుకోకుండా, వీటిని సరిదిద్దుకోవడానికి సిద్ధం కాకుండా అంతిమంగా పతనమైన జినుగు పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం లేదని చేసిన ఆరోపణలు ఏమాత్రం పసలేనివి. జినుగు దృష్టిలో పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యమంటే అరాచకవాదానికి, బురాక్రసీకి తలుపులు బార్లాతెరవడమే. ప్రజాస్వామిక పునాదిపై ఆధారపడి కేంద్రీకృత అధికారాన్ని నడిపే ఏ విప్లవ పార్టీ ఈ ధోరణిని అనుమతించదు. ఇపుడు శత్రు చెంత జినుగుకు విప్లవంపై దాడి చేసే అంతులేని ప్రజాస్వామ్యం దొరికింది కదా! జినుగు కోరుకునే ఇలాంటి తుచ్ఛమైన ప్రజాస్వామ్యం అత్యంత హింసాయుతమైన రాజ్యాన్ని కూలదోసి నూతన వ్యవస్థను నిర్మించటానికి ఎంతమాత్రమూ పనిరాదు. ఇది దుర్మార్గ వ్యవస్థకే తోడ్పడుతుంది.

అందువల్ల మన పార్టీ జినుగు చేస్తున్న చెత్త వాదనలను తిరస్కరిస్తున్నది, కుళ్లి కంపుగొడుతున్న ఈ అర్ధవలస, అర్ధ-భూస్వామ్య వ్యవస్థను ధ్వంసం చేసి, నూతన ప్రజాస్వామిక సమాజాన్ని స్థాపించేందుకు, ఆ తర్వాత దానిని సోషలిస్టు వ్యవస్థగా మార్చేందుకు సీపీఐ (మావోయిస్టు) నాయకత్వాన ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం (పీఎల్‌జీఏ), పీడిత ప్రజలు కొనసాగిస్తున్న దీర్ఘకాల ప్రజాయుద్ధ పంథాను దృఢంగా ఎత్తిపడుతున్నది. ఈ మహోన్నత లక్ష్యాన్ని సాధించేందుకు మెలికలు-మలుపులతో కూడిన, కఠినమైన, అత్యంత ప్రమాదభరితమైన దీర్ఘకాల ప్రజాయుద్ధం ద్వారా ధైర్యంగా ముందుకు సాగాలని కోరుతున్నది. విప్లవోద్యమ ఆచరణలో దొర్లిన తప్పులను, లోపాలను, బలహీనతలను సరిదిద్దుకునేందుకు ఏమాత్రం తడుముకోవద్దు; ఆచరణ నుండి నేర్చుకుందాం; మన ఎత్తుగడలను సంపద్వంతం చేసుకుంటూ, దీర్ఘకాల ప్రజాయుద్ధంలోకి విశాల ప్రజారాశులను సమీకరించడం ద్వారా విప్లవాన్ని పురోగమింపజేద్దాం. ఇందుకోసం దీర్ఘకాల ప్రజాయుద్ధం కన్నా సులభమైన దగ్గరి పరిష్కార మార్గమేదీ లేదు.

## పార్టీలో కార్మికవర్గేతర ధోరణులు ప్రబలుతున్నాయా?

విప్లవోద్యమంలోని ఆటుపోట్లను చూసి భీతిల్లిన సత్యాజీ, అరుణలు తమ స్వార్థ ప్రయోజనాల కోసం పార్టీపై, ఉద్యమంపై పలు నిందలు వేయడమే కాకుండా పార్టీ డబ్బులు వసూలు చేసి జల్సా చేయడం తప్ప మరో పని చేయడం లేదని పార్టీలో మహిళలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆరోపణలు చేసారు.

పార్టీలో కార్మికవర్గేతర ధోరణులు ప్రబలుతున్నాయని సత్యాజీ, అరుణలు చేస్తున్న ఆరోపణలు వాస్తవాలతో ఏమాత్రం పొసగవు. నిజానికి వారే నాయకత్వ లక్షణాలను, కేడర్ల విశ్వాసాన్ని కోల్పోయి, పెత్తందారీతనం, క్రమశిక్షణారాహిత్యంతో తమ చిత్తానుసారం వ్యవహరిస్తూ పార్టీ పంథాపై, ప్రజలపై విశ్వాసాన్ని కోల్పోయి అంతిమంగా దిగజారిపోయారు. వీరు తమ రాజకీయ పతనాన్ని, లొంగబాటును నిస్సిగ్గుగా మరుగుపరిచే ఉద్దేశ్యంతో పార్టీ తన సిద్ధాంతానికి కట్టుబడిలేదనీ, పార్టీలో మహిళలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారంటూ పలు నిందారోపణలకు దిగారు.

పార్టీలోకి ప్రధానంగా కార్మిక, రైతాంగ, పెటీ బూర్జువా వర్గాల నుంచి వస్తారు. జాతీయ బూర్జువా వర్గం నుంచీ కూడా వస్తారు. ఈ నాలుగు వర్గాల మైత్రితో కార్మికవర్గ నాయకత్వాన నూతన ప్రజాస్వామిక విప్లవం విజయవంతం చేయడం పార్టీ లక్ష్యం. ఇందులో ప్రధానంగా రైతాంగం నుంచి, పెటీ బూర్జువా వర్గం నుంచి పార్టీలో చేరుతున్నారు. వర్గ సమాజంలో ఆధిక్యతలో ఉండే దోపిడీ వర్గ భావజాల ప్రభావం ప్రజల మెదళ్లపై కూడా ఉంటుంది. పార్టీలోకి వచ్చాక విప్లవాచరణలో ఇది వివిధ రూపాలలో పార్టీ సభ్యులలో, వివిధ స్థాయి కేడర్లలో సైతం ప్రతిబింబిస్తుంటుంది. విప్లవోద్యమంలో వ్యక్తమయ్యే స్వీయాత్మకత, పెత్తందారీతనం, వివాహేతర సంబంధాలు, వృథా ఖర్చు వంటి ధోరణులకు ఈ కార్మికవర్గేతర భావజాలమే పునాది. అలాగే మహిళలు ఆత్మహత్యలు చేసుకున్న సందర్భాలలో పార్టీ లోతుగా సమీక్షించి పాఠాలు తీసుకుంది. మహిళా ప్రత్యేక సమావేశాలు జరిపి వారి సమస్యలను చర్చించి గైడ్ చేస్తున్నది. ప్రత్యేక సైనిక శిక్షణనిస్తున్నది. వారి, యావత్తు పార్టీ క్యాడర్ల రాజకీయ ఎదుగుదలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నది. విప్లవానికి ఆటంకమైన ఈ కార్మికవర్గేతర ధోరణులను వదిలించుకోవడం పార్టీ కార్మికవర్గీకరణ చెందడానికి అత్యంత ఆవశ్యకమైనదని పార్టీ భావిస్తుంది. ఇందుకోసం క్రమం తప్పకుండా ఆత్మవిమర్శ-విమర్శనా పద్ధతిని, ఆవశ్యకతను బట్టి దిద్దుబాటు కార్యక్రమాలను చేపడుతుంది. ఇలా తనను తాను ఒక కార్మికవర్గ అగ్రగామిగా పటిష్టం చేసుకుంటూ ఉంటుంది. ఇది ఒక క్రమం. ఈ క్రమంలో పెడధోరణులను విడనాడలేనివాళ్లు, కార్మికవర్గీకరణ చెందనివాళ్లూ పార్టీలో ఉండలేరు. అంతిమంగా పార్టీని విడిచిపెట్టిపోతారు. పెత్తందారీతనం, స్వీయాత్మకత, పితృస్వామ్యం, ఇతరులను తక్కువ చేసి చూసే అహంభావం వంటి పెడధోరణులు తరతమ స్థాయిల్లో మూర్తీభవించడం వల్లనే ఈ లంకా, జినుగు, సత్యాజీలు చివరకు విప్లవ వ్యతిరేకులుగా, ద్రోహులుగా తయారయ్యారు.

నిన్నటి వరకు విప్లవకారులుగా ఉన్న కొందరు, నేడు విప్లవప్రతీఘాతకులుగా మారడం ప్రపంచ విప్లవోద్యమ చరిత్రలో కొత్త కాదు. తీక్షణమైన వర్గ పోరాట పరీక్షలో విఫలమై శత్రువుతో చేతులు కలిపితే ఈ పరిణామం చోటు చేసుకుంటుందని చరిత్ర పలు మార్లు రుజువు చేసింది. ఎంఎల్ఎం వెలుగులో విప్లవ వ్యూహం-ఎత్తుగడలను అమలు చేస్తూ వర్గ యుద్ధానికి నాయకత్వం వహించే పార్టీలో కొనసాగే రెండు పంథాల మధ్య పోరాటంలో కార్మికవర్గ విప్లవకర మార్గాన్ని విడిచిపెట్టేసి, విప్లవానికీ, ప్రజలకు ద్రోహం చేసి అవకాశవాదంతో

కార్మికవర్గ వ్యతిరేక మార్గాన్ని చేపట్టినవారు విప్లవ ప్రతీఘాతకులుగా పనిచేస్తారని మావో పదే పదే చెప్పాడు. మహత్తర కార్మికవర్గ సోషలిస్టు విప్లవంలో 'ఒకటి రెండుగా విడిపోతుందని' మావో బోధించిన సూత్రానికి అర్థం ఇదే.

మొత్తం మీద చూసుకున్నప్పుడు పార్టీ మీద సైద్ధాంతికంగా, రాజకీయంగా ఈ విప్లవ ద్రోహులు సాగిస్తున్న దాడి పార్టీ పంథా మీద దాడే. భారత దోపిడీ పాలకవర్గాలకు కావాల్సింది ఇదే. ఇది ప్రజా వ్యతిరేకమైనది, విప్లవ వ్యతిరేకమైనది, విప్లవానికి తీరని నష్టం చేకూర్చేదీ. అయితే విప్లవ ద్రోహులు సాగించే ఇటువంటి దాడులతో పార్టీ బలహీనపడిపోదు. విప్లవానికి సమర్థవంతంగా నాయకత్వం వహించి విప్లవాన్ని పురోగమింపజేయడం ద్వారా అది మరింత బలోపేతమవుతుంది. పార్టీ ఒక నిర్మాణాత్మక సంఘటిత శక్తి. అది ప్రజల చేతిలో విప్లవం విజయవంతం చేసే ఒక ముఖ్యమైన సాధనం. పార్టీ ప్రజలతో సజీవ సంబంధాలను కలిగి ఉంది. నిత్యం ప్రజలు పార్టీని, దాని తప్పొప్పులనూ చూస్తున్నారు, చర్చిస్తున్నారు, విమర్శిస్తున్నారు. తప్పులను పార్టీ స్వీకరిస్తున్నది, 'ప్రజల నుండి ప్రజల కొరకు' అనే పద్ధతిని అనుసరిస్తూ ప్రజలకు నాయకత్వం వహిస్తున్నది. ప్రజల నుంచి వాస్తవాల్ని గ్రహిస్తున్నది, సరైన అభిప్రాయాలను క్రోడీకరించి వాటిని తిరిగి ప్రజల వద్దకు తీసుకువెళుతున్నది. ప్రజాపంథా-వర్గపంథాలో ముందుకు సాగుతున్నది. ఈ రకంగా అది ప్రజలతో పూర్తిగా మమేకమై ఉంది. ఈ మాజీ నాయకులు పార్టీ నుంచి, ప్రజల నుంచి నేర్చుకోలేకపోయారు, సైద్ధాంతికంగా, రాజకీయంగా పతనమై పార్టీ పంథాపై, ప్రజలపై విశ్వాసాన్ని కోల్పోయి అంతిమంగా విప్లవ ద్రోహులుగా మారారు. అందువల్లే వీరు తమ స్వార్థ ప్రయోజనాలు నెరవేర్చుకోవడం కోసం వివిధ రూపాలలో పార్టీపై, పార్టీ నాయకత్వంపై, విప్లవోద్యమంపై శత్రుపూరితంగా దాడి చేస్తున్నారు. కానీ వీరు ఆశలు అడియాశలు కాకతప్పదు. వీరు ఆశిస్తున్నట్టుగా సిద్ధాంతకర్తలు, చరిత్ర నిర్మాతలు ఇలాంటి తుచ్ఛులు కాదు ప్రజలు-ప్రజలు మాత్రమే.

---